క్లుప్తంగా

నల్లబ్యాడ్జీలతో పింఛన్ల పంపిణీ



నర్శిపూడిలో నల్లబ్యాడ్జీలు ధరించి పింఛన్లు పంపిణీ చేస్తున్న గ్రామ సచివాలయ ఉద్యోగి

ఆలమూరు: రాష్ట్ర ఐక్యవేదిక ఆదేశాల మేరకు మండలంలో గ్రామ సచివాలయ ఉద్యోగుల నిరసన కార్యక్రమం కొనసాగుతోంది. ఇప్పటికే వివిధ దశల్లో ఆందోళన చేస్తున్న ఉద్యోగులు బుధవారం నిర్వహించిన పింఛన్ల పంపిణీలో నల్లబ్యాడ్జీలు ధరించారు. ఇంటింటికి వెళ్లి వృద్ధ, వితంతు, దివ్యాంగులకు పింఛన్లు అందజేశారు. మండలంలోని 10829 పింఛన్లు ఉండగా అందులో తొలిరోజు 91.58 శాతం, 9,917 మందికి పంపిణీ చేశారు. మండలంలోని 18 గ్రామాల్లోని లబ్ధిదారులకు రూ.4,77,75,500 పంపిణీ చేయాల్సి ఉండగా 90.99 శాతం అనగా రూ.4,34,71,000 అందజేశారు. మిగిలిన లబ్ది దారులకు గురువారం పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ రాజు తెలిపారు.

రాష్ట్ర రిసోర్స్ పర్సన్లుగా ఇద్దరు ఉపాధ్యాయుల ఎంపిక

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన డీఎస్సీ 2025లో ఎంపికైన అభ్యర్థులకు శిక్షణనిచ్చేందుకు రిసోర్స్ పర్సన్లుగా ఇద్దరు ఉపాధ్యాయులను ఎంపిక చేసినట్లు ఎంఈఓ భమిడిపాటి అప్పాజీ తెలిపారు. ఎంపికైన ఉపాధ్యాయుల్లో మండలం నుంచి అద్దరి శ్రీనివాసరావు, ఉదతా వెంకటేశ్వరరావు ఉన్నారు. తూర్పుగోదావరి జిల్లాలోని రాజానగరం మండలంలోని కొండగుంటూరు పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించనున్న శిక్షణ శిబిరాల్లో వారిద్దరూ పాల్గొననున్నారు. ఈ శిక్షణలో కొత్తగా ఎంపికైన డీఎస్సీ అభ్యర్థులకు గణితం, ఎన్విరాన్‌మెంటల్, సైన్స్ అంశాల్లో శిక్షణ అందించనున్నారు.

పంచాయతీ చెరువులో చేపలు మృతి

మామిడికుదురు: పాశర్లపూడిలంక గ్రామ పంచాయతీకి చెందిన చెరువులో చేపలు నాలుగు రోజుల నుంచి చనిపోతున్నాయని స్థానికులు బుధవారం ఆందోళన వ్యక్తం చేశారు. చనిపోయిన చేపల నుంచి తీవ్ర దుర్వాసన వస్తోందన్నారు. సుమారు 70 చేపల వరకు చనిపోయాయని చెప్పారు. గ్రామ పంచాయతీ అధికారులు తక్షణం స్పందించాలన్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి సురేష్‌ను వివరణ కోరగా చెరువు వివాదం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉందన్నారు. ఇక్కడ నెలకొన్న పరిస్థితిని కోర్టు అధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. వారి సూచనల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

క్రైస్తవ పాటల పోటీల్లో విజేతలకు బహుమతులు

మలికిపురం: శంకరగుప్తం సెంటర్ జయ చాపల్ చర్చిలో ఎస్‌టీఎస్ టీం ఆధ్వర్యంలో బుధవారం క్రైస్తవ పాటల పోటీలు నిర్వహించారు. ఆయా గ్రామాలకు చెందిన గాయనీ గాయకులు సుమారు 80 మంది పాటలు పోటీల్లో పాల్గొన్నారు. ఈ పాటల పోటీలకు న్యాయ నిర్ణేతలుగా అధ్యాపకులు నక్కా రమేష్, జూలియన్ విక్టర్ సరిత ప్రసాద్ వ్యవహరించారు. ప్రథమ బహుమతి నేతల ప్రిస్కిల్ల (శంకరగుప్తం), ద్వితీయ బహుమతి తాడి సరిత (పడమటిపాలెం,) తృతీయ బహుమతి తాడి సుధీర్ గెలుపొందారు. పాల్గొన్న వారందరికీ పతకాలు అందించారు. పాస్టర్ గమనియేల్ అహరోన్ సంపత్ కుమార్ పాల్గొన్నారు.

ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలి

మామిడికుదురు: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం ఆనందంగా ఉంటుందని లూటుకుర్రు సర్పంచ్ అడబాల తాతకాపు అన్నారు. లూటుకుర్రు, నగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద బుధవారం స్వస్థ్ నారీ–స్వసక్త్ పరివార్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాలను సర్పంచ్‌లు అడబాల తాతకాపు, జాలెం రమణకుమారి ప్రారంభించారు. మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించిన అవసరమైన వారికి మందులు అందజేశారు.కార్యక్రమాల్లో ఎంపీటీసీ నామన వెంకటేశ్వరరావు, కూటమి నేతలు, వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

అంబాజీపేట: పుల్లేటికుర్రు ఇరుసుమండ జంక్షన్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు కాగా ఆమె భర్తకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అయినవిల్లి మండలం తొత్తరమూడి నేదునూరివారిపేటకు చెందిన కొడమంచిలి లక్ష్మీనారాయణ, తన భార్య కృష్ణవేణితో కలిసి మోపెడ్‌పై ఇంటికి వెళుతున్నారు. పుల్లేటికుర్రు ఇరుసుమండ జంక్షన్ వద్దకు వచ్చేసరికి అమలాపురం నుంచి విజయవాడ వెళ్తున్న బైపాస్ ఎక్స్‌ప్రెస్ ఢీకొనడంతో కృష్ణవేణి ఎడమకాలు బస్సు కిందపడి నుజ్జునుజ్జయ్యింది. కృష్ణవేణికి, లక్ష్మీనారాయణను స్థానికులు అమలాపురం ఆసుపత్రికి తరలించారు. దీనిపై అంబాజీపేట పోలీసులకు సమాచారం అందజేశారు.

భక్తిశ్రద్ధలతో మహర్నవమి వేడుకలు

- పదవ రోజు మహిషాసురమర్దినిగా విజయ కనకదుర్గాదేవి
- నేడు విజయదశమి పర్వదినం
- అమ్మవారి ఆలయాలు, ఉత్సవ పందిర్లలో విశేష పూజలు



చింతలమోరిలో అమ్మవారి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు



అప్పనపల్లిలో మహాలక్ష్మి అలంకరణలో కనకదుర్గమ్మ



మహిషాసురమర్దిని అలంకరణలో దుర్గమ్మ

కొత్తపేట: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా వాడవాడలా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. 11వ రోజు గురువారం విజయ దశమితో ఉత్సవాలు ముగియనున్నాయి. బుధవారం స్థానిక బొరుసువారిసావరం విజయకనకదుర్గాదేవి అమ్మవారిని ఆలయ పోషకులు బొరుసు వెంకట ఉదయభాస్కర్ – వసుద దంపతుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు మహిషాసురమర్దినీ దేవిగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. స్థానిక వాసవీకన్యకాపరమేశ్వరి అమ్మవారిని, వాడపాలెం జ్ఞానసరస్వతీదేవి అమ్మవారిని, కొత్తపేట, బంగారమ్మ అమ్మవారిని, బోడిపాలెం విజయ కనకదుర్గాదేవి అమ్మవారిని, వానపల్లి పళ్లాలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కుంకుమ పూజలు

అంబాజీపేట: మండలంలోని పలు గ్రామాల్లోని కనకదుర్గమ్మ ఆలయాల వద్ద బుధవారం వేకువ జాము నుంచి మహిళలు ఘనంగా కుంకుమ పూజలు నిర్వహించారు. శ్రీ వీణా శ్యామలాంబ సమేత చంద్రశేఖర స్వామి ఆలయం, మాచవరం పక్షుల రావిచెట్టు వద్ద శ్రీరాంనగర్‌లో, అంబాజీపేట పశువుల మార్కెట్ వద్ద ఆలయాల్లో కుంకుమ పూజలు నిర్వహించారు. శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు శ్రీరాజరాజేశ్వరిదేవిగాభక్తులకు దర్శనమిచ్చారు.

వరద నీటిలోనే వెళ్లి అమ్మవారికి పూజలు

మామిడికుదురు: పెదపట్నంలంక కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మగటపల్లి గాయత్రి త్రిశక్తి పీఠంలో బ్రహ్మశ్రీ చెరుకుమిల్లి లక్ష్మణ శాస్త్రి, గోవిందవర్జుల రామశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాశర్లపూడిబాడవ కనకదుర్గమ్మ ఆలయాన్ని వరద ముంచెత్తింది. వరద నీటిలోనే వెళ్లి భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. నగరం మొల్లాయిపాలెం, మామిడికుదురు, అప్పనపల్లి, లూటుకుర్రు, బి.దొడ్డవరం, నగరం, పాశర్లపూడిలంక తదితర గ్రామాల్లో దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు.

విశేషాలంకరణలో దుర్గమ్మ

అయినవిల్లి: మాగాపువారిపేట వద్ద కనకదుర్గమ్మవారికి బుధవారం విశేష పూజలు చేశారు. ముక్తేశ్వరం ముక్తికాంత క్షణముక్తేశ్వరస్వామి ఆలయంలో ముక్తికాంతమ్మవారికి, శ్రీదేవి, భూదేవి సమేత కేశవస్వామి ఆలయంలో కొలువైన లక్ష్మీదేవి అమ్మవారికి, తొత్తరమూడి రాజరాజేశ్వరీదేవి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.

గ్రామాల్లో వైభవంగా పూజలు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం మహర్నవమి వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలమూరులోని అతి ప్రాచీన దేవాలయం బంగారు పాప (స్వర్ణబాల) అమ్మవారి ఆలయంలో వేద పండితులు చండీహోమం, హుర్ణాహుతి కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో మహర్నవమి వేడుకలను పురస్కరించుకుని పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

చింతలమోరి దసరా పూజల్లో పాల్గొన్న గొల్లపల్లి

మలికిపురం: మండలంలోని చింతలమోరిలో బుధవారం నిర్వహించిన దసరా పూజలలో మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పాల్గొన్నారు. గ్రామంలో కనకదుర్గ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం వద్ద స్థానిక నాయకులతో కలిసి పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈద రవి రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు పేరా బత్తుల నాగబాబు, కొల్లు పెద్దిరాజు, కొల్లు మురళీకృష్ణ, కొల్లు రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాల్లో నిబంధనలు పాటించాలి



కొత్తపేటలోని హోల్‌సేల్ షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న ఆర్డీఓ శ్రీకర్, డీఎస్పీ మురళీమోహన్

కొత్తపేట: దీపావళి బాణసంచా తయారీ, హోల్‌సేల్, రిటైల్ విక్రయ కేంద్రాల వద్ద నిబంధనలు విధిగా పాటించాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని స్థానిక ఆర్డీఓ పి.శ్రీకర్, డీఎస్పీ సుంకర మురళీమోహన్ తయారీదారులు, హోల్‌సేల్ వ్యాపారులను హెచ్చరించారు. ఈ నెల 20న దీపావళి సందర్భంగా ఇప్పటికే పలు బాణసంచా తయారీ కేంద్రాలు, హోల్‌సేల్ షాపుల్లో విక్రయాలు సాగిస్తున్నారు. దీపావళికి ముందు మూడు రోజులు తాత్కాలిక లైసెన్స్‌లతో రిటైల్ వ్యాపారులు షాపులు ఏర్పాటు చేసుకుని విక్రయాలకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం కొత్తపేటలో హోల్‌సేల్ షాపులను ఆర్డీఓ, డీఎస్పీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రమాదాలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామన్నారు. తయారీదారులు, వ్యాపారులు నిబంధనలు పాటించాలని సూచించారు. లైసెన్స్ లేకుండా బాణసంచా తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తహసీల్దార్ వై.రాంబాబు, ఎస్సై జి.సురేంద్ర తదితర అధికారులు, సిబ్బంది ఉన్నారు.

అక్రమంగా బాణసంచా తయారు చేస్తే కఠిన చర్యలు

అయినవిల్లి: ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా బాణసంచా తయారీ చేసినా, విక్రయించినా ప్రభుత్వపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సీహెచ్ విద్యాపతి అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ బాణసంచా తయారు చేసే వారు తప్పని సరిగా లైసెన్సులు పొందాలన్నారు. గతంలో పొందిన లైసెన్సులను రెన్యూవల్ చేయించుకోవాలన్నారు. అక్రమంగా బాణసంచా తయారీ, విక్రయాలపై సమాచారం సెల్ నంబర్ 9849903105కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

వృద్ధులను గౌరవించాలి



బాలయోగి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బండారు, సీఆర్‌సీ ఓల్డేజ్ హోమ్ సభ్యులు

రావులపాలెం: వృద్ధులను గౌరవించడం, వారిని జాగ్రత్తగా చూసుకోవలసిన బాధ్యత నేటి తరంపై ఉందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. స్థానిక సీఆర్‌సీలో బుధవారం నిర్వహించిన ప్రపంచ వృద్ధుల దినోత్సవం, దివంగత జీఎంసీ బాలయోగి జయంతి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. వృద్ధులందరికీ అన్నదానం, వస్త్రదానం చేశారు. అనంతరం జీఎంసీ బాలయోగి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బాలయోగికి ఘన నివాళి

మలికిపురం: లోక్ సభ దివంగత స్పీకర్ జీఎంసీ బాలయోగి జయంతి సందర్భంగా మండలంలోని దిండి వై.జంక్షన్ బుధవారం నిర్వహించారు. బాలయోగి విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే దేవవరప్రసాద్, మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు పాల్గొన్నారు.

బాలయోగి జీవితం స్ఫూర్తిదాయకం

అయినవిల్లి: కె.జగన్నాథపురంలో జీఎంసీ బాలయోగి జయంతిని బాలయోగి చారిటబుల్ సొసైటీ రాష్ట్ర కన్వీనర్, భారతీయ హ్యూమన్ కౌన్సిల్ జోనల్ హెడ్ రాయి రాంబాబు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మాజీ పీఎం వాజ్‌పేయి విగ్రహం ఏర్పాటుకు సన్నాహాలు



కొత్తపేట వుడయార్ శిల్పశాలలో వాజ్‌పేయి విగ్రహంతో శిల్పి రాజ్‌కుమార్, బీజేపీ నేతలు

కొత్తపేట: మాజీ ప్రధానమంత్రి వాజ్‌పేయి విగ్రహాన్ని మండపేటలో నెలకొల్పనున్నట్టు బీజేపీ నాయకులు తెలిపారు. మండపేట బీజేపీ కమిటీ ఆధ్వర్యంలో నెలకొల్పే 9 అడుగుల వాజ్‌పేయి విగ్రహాన్ని కొత్తపేటలో ప్రముఖ అంతర్జాతీయ శిల్పి డి.రాజ్‌కుమార్ వుడయార్ రూపొందించగా బుధవారం సాయంత్రం మండపేట తరలించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ తాపేశ్వరం – రామచంద్రపురం రోడ్డులో మండపేట బైపాస్ రోడ్డు ముఖద్వారం వద్ద ప్రత్యేకంగా కేటాయించిన స్థలంలో ఈ విగ్రహాన్ని నెలకొల్పనున్నట్టు తెలిపారు. ఈ నెల రెండో వారంలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితర రాష్ట్ర, జాతీయ బీజేపీ నాయకులు చేతుల మీదుగా ఆవిష్కరించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, లొల్ల సర్పంచ్ చర్రాది జానకీరామ్, రాష్ట్ర యువమోర్చా అధికార ప్రతినిధి జేపీ, మండల పార్టీ అధ్యక్షుడు సంపతి కనకేశ్వరరావు, ఆ పార్టీ జిల్లా, మండపేట నియోజకవర్గ నాయకులు, కోన సత్యనారాయణ, కేవీవీ సాయిరామ్‌మద్దుల సుబ్బారావు, కోటిపల్లి దామోదర్, బండారు సూరిబాబు, కోటిపల్లి కృష్ణమాచార్యులు, రాయి వీర్రాజు పాల్గొన్నారు.

అప్పనపల్లి కాజ్‌వేపై రాకపోకలు నిషేధం



వరద నీటిలో అప్పనపల్లి కాజ్‌వే



పి.గన్నవరం అక్విడెక్టు వద్ద వరద ఉధృతి

మామిడికుదురు: గోదావరి వరద ఉధృతితో లంక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ప్రధాన రహదారులను వరద నీరు ముంచెత్తడంతో తీర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అప్పనపల్లి కాజ్‌వే నీట మునిగింది. ఇక్కడ నాలుగడుగులు పైబడి వరద నీరు ప్రవహిస్తోంది. ఈ మార్గంలో రాకపోకలను పూర్తిగా నిషేధించారు. ఆర్టీసీ సర్వీసులను రద్దు చేశారు. అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నం లంక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మామిడికుదురు చివారు కొర్లగుంట ఏటిగట్టు దిగువ నుంచి అప్పనపల్లి వెళ్లే రోడ్డు ముంపులో చిక్కుకుంది. పాశర్లపూడి, పాశర్లపూడిలంకలోని మత్స్యకార కాలనీలను వరద నీరు చుట్టుముట్టింది. పెదపట్నం మధ్య లంక పూర్తిగా ముంపుబారిన పడింది. లంక గ్రామాల్లోని కూరగాయల తోటలు, కొబ్బరి తోటలు ముంపు బారిన పడ్డాయి. అప్పనపల్లి స్నానాల రేవులో అమృతలింగేశ్వరస్వామి విగ్రహం పూర్తిగా మునిగిపోయింది.

ఆందోళనలో లంక గ్రామాల ప్రజలు

పి.గన్నవరం: మండలంలోని వశిష్ట, వైనతేయ నదీపాయల్లో వరద ఉధృతి పెరుగుతుండటంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మానేపల్లి శివారు శివాలయలంకకు వెళ్లే రహదారి వరదనీట మునగడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెల వారిపేట, బూరుగు లంక గ్రామాలతో పాటు, జిల్లాకు సరిహద్దులో ఉన్న పెదమల్లంక, సిర్రావారిలంక, ఆనర్లంక, అయోధ్యలంక గ్రామాల ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. నాగుల్లంక నుంచి పుచ్చల్లంకకు వెళ్లే రహదారి వరదనీట మునిగింది. చాకలిపాలెం శివారు కనకాయలంక కాజ్‌వేపై వరద ఉధృతి కొనసాగుతుండటంతో ఆగ్రామ ప్రజలు పడవలపై వెళ్తున్నారు.

ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు

అయినవిల్లి: మండల పరిధిలోని లంక గ్రామాల్లో వరద ఉధృతి పెరుగుతోంది. లంక గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలకు వరద నీరు చుట్టుముట్టింది. ముక్తేశ్వరం–అయినవిల్లిలంక మధ్య ఎదురుబిడెం కాజ్‌వేపై పడవల సాయంతో ప్రజలు రాకపోకలు కొనసాగిస్తున్నారు. అయినవిల్లిలంక, వీరవల్లిపాలెం, కపిలేశ్వరపురం మండలంలోని అద్దంకివారిలంక గ్రామస్తులు నిత్యావసరాలు తెచ్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. రెవెన్యూ అధికారులు నాలుగు నాటు పడవలు ఏర్పాటు చేశారు. ముక్తేశ్వరం వృద్ధగౌతమి పాయ వద్ద వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎదురుబిడెం కాజ్‌వే వద్ద అయినవిల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య సేవలందిస్తున్నారు.

కాజ్‌వేను పరిశీలించిన కలెక్టర్



కాజ్‌వే వద్ద వరద పరిస్థితిని సమీక్షిస్తున్న కలెక్టర్

అయినవిల్లి: ముక్తేశ్వరం–అయినవిల్లిలంక ఎదురుబిడెం కాజ్‌వేను జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్ బుధవారం పరిశీలించారు. పడవలపై ప్రయాణిస్తున్న లంక గ్రామస్తులను ఏర్పాట్లపై అడిగి తెలుసుకున్నారు. కాజ్‌వే వద్ద వరద ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు చేపట్టేందుకు స్థానిక అధికారులతో చర్చించారు. ఆయన వెంట ఆర్డీఓ పి.శ్రీకర్, తహసీల్దార్ పీహెచ్ విద్యాపతి, డిప్యూటీ ఎంపీడీఓ వాణిశ్రీ బెహర, డీటీ శ్రీనివాస్ తదితరులున్నారు.



ముంపునకు గురైన అప్పనపల్లి స్నానాల రేవు



ముక్తేశ్వరం-అయినవిల్లిలంక మధ్య కాజ్‌వేను పడవలపై దాటుతున్న లంక గ్రామస్తులు

ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, గన్నవరపు పరామర్శ



అమ్మాజీ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, గన్నవరపు

పి.గన్నవరం: వాడ్రేవుపల్లి శివారు చాకలిపాలెంలో ఉండ్రాజవరపు అమ్మాజీ ఇటీవల మరణించగా, ఆమె కుటుంబ సభ్యులను పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ బుధవారం పరామర్శించారు. ఆమె కుటుంబ సభ్యులు సత్యనారాయణ, ప్రేమ్ కుమార్‌ను వారు ఓదార్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కొపనాతి రోజావాణి, సత్తిబాబు, ఉప్పాటి రాజేష్, రమేష్, ప్రభుదాస్, పితాని త్రిమూర్తులు, కర్రి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరీదేవి పరామర్శ



పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరీదేవి, పాముల దేవీ ప్రకాష్

అయినవిల్లి: మండలంలోని విలస గ్రామంలో బాణసంచా పేలి మృత్యువాత పడిన వారి కుటుంబాన్ని బుధవారం మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి పాముల దేవీప్రకాష్ పరామర్శించారు. ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని వారు పరిశీలించారు. ప్రమాదానికి కారణాన్ని అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వారి వెంట ఏఎంసీ మాజీ చైర్మన్ కృష్ణంరాజు, విలస పీఏసీఎస్ మాజీ చైర్మన్ సరిపెళ్ల కన్నబాబురాజు, సర్పంచ్ కుసుమలిల్లీ మంగేష్కర్, నాయకులు కుసుమ సునీల్‌కుమార్ మట్టపర్తి వెంకటరమణ తదితరులు ఉన్నారు.

టెంపుల్ టూరిజం అభివృద్ధికి చర్యలు

కొత్తపేట: రాష్ట్రంలో టెంపుల్ టూరిజం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్టు రాష్ట్ర టూరిజం, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. కొత్తపేట బొరుసువారి సావరం విజయకనకదుర్గాదేవిని బుధవారం ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పునఃనిర్మాణకర్త బొరుసు వెంకట ఉదయభాస్కర్ ఆహ్వానం మేరకు ఆయన ఆలయానికి వచ్చి పూజల్లో పాల్గొన్నారు. ముందుగా ఆయనకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని, టెంపుల్ టూరిజంను అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్టు తెలిపారు. కొత్తపే నియోజకవర్గంలో కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి, మందపల్లి, ర్యాలీ వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాలు, పురాతన ఆలయాలు ఉన్నాయని, వాటన్నింటినీ కలుపుతూ టెంపుల్ సర్క్యూట్ ఏర్పాటుచేసి టెంపుల్ టూరిజాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదించామన్నారు. స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాసరావు, అంతర్జాతీయ శిల్పి డాక్టర్ డీ.రాజ్‌కుమార్ వుడయార్ పాల్గొన్నారు.

కోల్డ్ స్టోరేజ్ యూనిట్లు ఏర్పాటు చేయాలి

అంబాజీపేట: కోనసీమ ప్రాంతంలో సాగవుతున్న ఉద్యాన పంటల నిల్వ చేసుకునేందుకు ప్రభుత్వం కోల్డ్ స్టోరేజ్ యూనిట్లను ఏర్పాటు చేసి రైతులకు మేలు చేయాలని అంబాజీపేట శ్రీ ధరణి రైతు సమాఖ్య డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌ను కోరారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో రైతులు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. సమాఖ్య కార్యదర్శి నక్కా భాస్కర్, రైతులు పాల్గొన్నారు.

ఫోరెన్సిక్ బృందం పరిశీలన

అయినవిల్లి: మండలంలోని విలస గ్రామంలో బాణసంచా పేలి భార్యాభర్తలు మృతి చెందిన ఘటన తెలిసిందే. బుధవారం విజయవాడకు చెందిన ఫోరెన్సిక్ బృందం ఘటన స్థలాన్ని పరిశీలించింది. బాణసంచా పేలుడుకు కారణాలు అన్వేషించింది. అక్కడున్న ఆధారాలను సేకరించింది. ఘటనకు సంబంధించిన వివరాలు స్థానికులను అడిగి తెలుసుకున్నారు.

దసరా ఊరేగింపులపై నిఘా

అమలాపురం టౌన్: రాష్ట్ర వ్యాప్త ఖ్యాతి ఉన్న అమలాపురం దసరా ఉత్సవాలు, ఊరేగింపులకు జిల్లా పోలీస్ శాఖ అన్ని బందోబస్తు ఏర్పాట్లతో సిద్ధమైంది. విజయ దశమి రోజైన గురువారం పట్టణంలో ఏడు వీధుల ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఏడు ఊరేగింపులు నిర్వహణకు ఆయా ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేసుకున్నాయి. ఈ ఊరేగింపులను ఆద్యంతం వీడియోలు, డ్రోన్లతో చిత్రీకరించేందుకు అవసరమైన సన్నద్ధమవుతున్నారు. 500 మంది పోలీస్ బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీ రాహుల్ మీనా పర్యవేక్షణలో ఏఎస్పీ, ఇద్దరు డీఎస్పీలు, 11 మంది సీఐలు, 39 మంది ఎస్సైలతోపాటు 116 మంది ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, 172 మంది కానిస్టేబుళ్లు, 16 మంది మహిళా కానిస్టేబుళ్లు, 108 మంది హోంగార్డులు, సాయుధ పోలీసులు బందోబస్తుగా ఉండనున్నారు.